



వైద్యాధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సీఎం నోట తిమ్మాపూర్ మాట

- భూ కుంభకోణాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి
- ఇటీవలే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): తిమ్మాపూర్ భూదాన భూముల కుంభకోణం వ్యవహారం అసెంబ్లీని తాకింది. భూదాన భూముల కుంభకోణాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కుంభకోణానికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు వెల్లడించారు. నగర శివార్లలోని కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో రూ.200కోట్ల విలువైన 40 ఎకరాల భూదాన భూములు అన్యాక్రాంతంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నికలకు ముందు బడానేతలు బినామీలను అడ్డుపెట్టుకుని భూదాన భూములను దొడ్డిదారిన పట్టా భూములుగా మార్చిన వైనంపై అక్టోబర్ 28న 'నాయకులు భూదాహం.. అధికారుల భూదానం' శీర్షికతో ప్రచురితమైన కథనం కలకలం రేకెత్తించింది. ఈ కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి దీనికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసింది. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం దీన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తరువాత అనేక అక్రమాలు, భూకుంభకోణాలు జరిగాయని తిమ్మాపూర్ భూదాన భూములను కూడా రికార్డులను తారుమారు చేసి అన్యాక్రాంతం చేశారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వగ్రామమైన తిమ్మాపూర్‌లోనే ఇది జరిగిందని స్వయంగా కేంద్ర మంత్రి ఫిర్యాదు చేసినా కూడా విలువైన భూములను పరాధీనం చేశారని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే విచారణ జరిపించి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టించానన్నారు. అలాగే గతంలో 'ఆంధ్రజ్యోతి ' ప్రచురించిన పొక్కాల్‌గూడ భూముల కుంభకోణం విషయం కూడా సీఎం ప్రస్తావించారు. వీటన్నింటిపై విచారించి తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.


నాయకుల భూదాహం..
అధికారుల భూదానం
ఇద్దరు బడా నేతల కనుసన్నల్లో హైదరాబాద్ శివార్లలో భారీ స్కాం

తిమ్మపూర్ భూములపై ప్రచురితమైన కథనం



ఫ్యూచర్ సిటీ పరుగులు!

ప్రత్యేక అథారిటీ ఏర్పాటుకు కసరత్తు

నగర శివారులో ప్రభుత్వం కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీని పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా వారం రోజుల్లో ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. స్వయం ప్రతిపత్తి కలిగిన అథారిటీ ద్వారా ఫ్యూచర్ సిటీ పనులు వేగంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అథారిటీకి పాలకవర్గంతో పాటు ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇది ఏర్పాటు కాగానే భూసేకరణ, నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి.

- పాలకవర్గంలో కీలక నేతలకు అవకాశం
- కొత్త సిటీ పరిధిలో మాస్టర్ ప్లాన్
- ప్రభుత్వ భూముల వినియోగానికి ఏర్పాట్లు
- తొలుత చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసే అథారిటీలో కొందరు కీలక రాజకీయ నేతలకు పునరావాసం కల్పించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో పరపతి కలిగిన ఒకరిద్దరు కీలక నేతలతో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ ఇప్పటి వరకు అవకాశాలు దొరకని రాష్ట్రంలో పేరున్న నేతలను కూడా అథారిటీ పాలకవర్గంలోకి తీసుకోనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఫ్యూచర్‌సిటీ కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ కూడా రూపొందిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారమే ఈ సిటీలో నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటుంది. మాస్టర్ ప్లాన్‌లో కొంత భూభాగంలో ఆంక్షలు ఉండే అవకాశం ఉన్నా.. మిగతా దాంట్లో నిర్మాణాలకు అనుకూలంగా ఉండే విధంగా చూస్తున్నట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీని మరింత విస్తరించాలని భావిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు అందుబాటులో ఉన్న భూమి కంటే దాదాపు రెట్టింపు భూమి అంటే 30వేలకుపైగా ఎకరాలను వివిధ మార్గాల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఫ్యూచర్ సిటీ కోసం ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ భూములన్నీ అప్పట్లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం సేకరించడంతో



మిగతా 7వ పేజీలో...

హాస్టల్లోనే విద్యార్థినులకు చికిత్స

- పరామర్శించిన అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

కీసర రూరల్, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా నాగారంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై మండల వైద్యారోగ్య శాఖ అధికారి సౌందర్యలతను అడిగి తెలుసుకున్నారు. కాగా అస్వస్థతకు గురైన బాలికలకు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన 9మంది విద్యార్థులు కోలుకున్నారు. మరికొంత మంది విద్యార్థులకు ముందస్తుగా హాస్టల్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్ పరిసరాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మైనారిటీ బాలిక పాఠశాలలో ఆహారం వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడారు. వారి ఆరోగ్యం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాల పంపిణీ లక్ష్యం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు లోన్, బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాలలోపు ఉన్న మహిళా సంఘ సభ్యులు తీసుకున్న బ్యాంక్ రుణాలకు ప్రభుత్వం 14 మార్చి 2024 నుంచి ఉచిత వడ్డీ సౌకర్యం కల్పించిందన్నారు. రుణ బీమా తీసుకున్న సభ్యురాలు చనిపోతే ఆమె రుణానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు మండల సమైఖ్యలో సమర్పించి లబ్ధిపొందాలని సూచించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా అర్హత కలిగిన సంఘాలకు టార్గెట్ ప్రకారం రుణాలను అందించాలన్నారు.

రికవరీపై దృష్టి సారించాలి

జిల్లాలో మహిళా సమాఖ్య సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు రుణాలను టార్గెట్ ప్రకారం పంపిణీ చేయాలని తెలిపారు. అదే విధంగా రుణాల పంపిణీతో పాటు రికవరీ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతీవారం గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించాలని, రికవరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్లెయిమ్‌లకు సంబంధించిన రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఆదేశించారు. రుణాలపై అందరికి అర్థమయ్యేలా చెప్పి బ్యాంక్ లింకేజీ రికవరీలు 100 శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. టూ వీలర్ పైన మొబైల్ క్యాంటీన్, బ్రౌన్ రైస్, మిల్లెట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, అదనపు పీడీ సరోజ, శ్రీనిధి ఆర్ఎం ఉదయకుమారి, డీపీఎంలు, అదనపు పీడీ సరోజ, శ్రీనిధి ఆర్ఎం ఉదయకుమారి, డీపీఎంలు, ఎంపీఎంలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో ఆనందోత్సాహాలు

37 రోజుల తర్వాత జైలు నుంచి రైతుల విడుదల

- సొంత గ్రామాలకు చేరిన 17మంది బాధితులు
- రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలో పండగ వాతావరణం
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు, ఆత్మీయ పలకరింపులు
- స్వాగతం పలికిన బీఆర్ఎస్, గిరిజన సంఘాల నేతలు



తల్లికి అన్నం తినిపిస్తున్న సేవ్యా నాయక్

బొంరాస్‌పేట్/కంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 37 రోజుల పాటు జైల్లో ఉన్న లగచర్ల ఘటన బాధిత రైతులు శుక్రవారం ఉదయం సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. వారంతా సొంత ఊర్లకు చేరుకోవడంతో లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో పండగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు వారిని గుండెలకు హత్తుకొని కన్నీటిపర్యంతమయ్యారు. నాంపల్లి ప్రత్యేక కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసినా పేపర్లు జైలులో అందించడంలో ఆలస్యం కారణంగా శుక్రవారం ఉదయం 17 మంది విడదలై సొంత గ్రామాలకు చేరకున్నారు. ఎప్పుడూ జైలు జీవితం ఎరగని ఆ రైతులు నెలన్నర పాటు చెరసాలలో ఉండటంతో ఆయా కుటుంబ సభ్యులు తమవారిని చూసి రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. రైతులు విడుదల పట్ల ఆయా గ్రామాల్లో సంతోషం కనిపించింది. షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. ఏ-2 నిందితుడు సురేశ్‌తో కలిపి మరో

మిగతా 8వ పేజీలో...



రోటిబండ తండాలో కుటుంబ సభ్యుల రోదనలు

భయంతో జైల్లో నిద్ర పట్టేది కాదు



వ్యవసాయం చేసుకుని బతికే నన్ను అక్రమ కేసులో దోషిని చేశారు. పోలీసులు కొట్టింది చాలక జైల్లో పెట్టించారు. ప్రతీ రోజు కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చి కుమిలిపోయేవాడిని. భయంతో రాత్రిపూట జైలులో నిద్రపట్టేది కాదు. ఎంత వేధించినా మా భూమలను వదులుకోం. ఆ రోజు దాడి ఘటనలో మేం లేకున్నా మమ్మల్ని బలవంతంగా నిర్బంధించి జైలుకు పంపించారు.

-లక్ష్మయ్య, రైతు, లగచర్ల




ఏఈఓకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

కొడంగల్ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూర వెంకటయ్య ఆరోపించారు. శుక్రవారం ఆయన పలువురు రైతులతో కలిసి స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తి స్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, కౌలు రైతులకు రూ.12 వేలు వెంటనే అందించాలన్నారు. అనంతరం ఏఈవో దేవేందర్ రాథోడ్‌కు వినతి పత్రం అందించారు.

రైల్వే వంతెనను త్వరగా పూర్తి చేయాలి



దీక్షను విరమింపజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఎట్టకేలకు శుక్రవారం విరమించారు. దీక్షా శిబిరాన్ని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ దీక్షలో కూర్చున్న వారికి జ్యూస్ ఇచ్చి విరమింపజేశారు. ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం పూర్తికాక పోవడంతో వ్యాపారాలు చేయలేక నష్టపోతున్నామని వాపోయారు. ఘట్‌కేసర్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు మాట్లాడుతూ తాము వ్యాపార సముదాయాలను కోల్పోవడం వలన దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడింతలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గతంలో ఇచ్చిన 60 గజాల ఇంటి స్థలాన్ని అప్పగించాలని కోరారు. అర్హులైన బాధితులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు అందిస్తామని, కోర్టులో ఉన్న పరిహారంను త్వరగా ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని వంతెన నిర్మాణానికి అవాంతరాలు కలిగించకుండ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌గా తాండూరు రోడ్డు

- బీదర్ వరకు నిర్మాణానికి కార్యాచరణ
- 134 కిలోమీటర్లుగా 'నేషనల్ హైవే 50'
- ప్రయాణికులకు తగ్గనున్న దూరాభారం

8

చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎంఆర్‌జీఐ డైరెక్టర్ శాలిని
- రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు హాజరైన క్రీడాకారులు

7



బోనాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

బోనాలతో వినూత్న నిరసన

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన

వికారాబాద్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అమ్మవారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దీవెనలు ఇచ్చి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి న్యాయం జరిగేలా చూడాలని సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాయనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం 15వ రోజు సమ్మెలో భాగంగా ఉద్యోగులు బోనాలు తీసి పోతురాజులు, శివసత్తులతో ర్యాలీ నిర్వహించి కొత్తగంజ్‌లోని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గంగానాయక్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అలాగే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రభావతి, డీపీవో శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాల ఎస్‌వోలు ఆశాలత, స్వరూప, శైలజా, రాధికా, పల్లవి, దేవి, రాజేశ్వరి, స్రవంతి, సుమిత్ర, చైతన్య, రఘుసింగ్, రఘు, సర్వర్, వెంకట్ రెడ్డి, దశరథ్, మాధవి, మమతా, మోహన్, జ్యోతి, ప్రియాంక, అనిత, రమాదేవి, విజయ్, నర్సిములు, నాగయ్య పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం



భిక్షాటన కార్యక్రమంలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 50వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువజన సంఘాల సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీబావంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ లు ఏదుల శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌ల ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు జోలె పట్టి దుకాణాలు, హోటళ్లలో బిక్షాటన చేశారు. రిలే దీక్షల్లో నాయకులు వెంకటయ్య, సాయికుమార్, సాయిబాబా, ఆంజనేయులు, సురేశ్, తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ


యాచారం : పడిపూజలో అయ్యప్ప స్వామి దీక్షాధారులు, భక్తులు


చేవెళ్ల : ముడిమ్యాల్‌లో నిర్వహించిన పూజలో ప్రతాప్‌రెడ్డి, తదితరులు

యాచారం/చేవెళ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రం అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది భక్తులు, దీక్షాపరులు పూజలో పాల్గొన్నారు. చందర్‌నాయర్, కె.బాషా స్వామిల పర్యవేక్షణలో దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఇ రుముడి కట్టుకున్న దీక్షాపరులు వేంకటేశ్వర స్వామి గుట్ట నుంచి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు పాదయాత్రగా తరలి ఆలయంలో పూజలు చేసి ఇరుముడి ఎత్తుకొని శబరి యాత్రకు బయల్దేరారు. చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతంతో అభిషేకాలు, అన్నిరకాల పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మారుమోగింది. ఈ కార్యక్రమం అనంతరం వందలాదిగా తరలివచ్చిన స్వాములకు, వివిధ గ్రామల ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అయ్యప్పస్వాములు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రూ.28లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

కీసర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తున్నట్లు చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా ప్రాధాన్యతా పరంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు తెలిపారు. కీసరలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలకు భగీరథ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.5లక్షలు, లైట్ల మరమ్మతుకు రూ.5లక్షలతో పాటు పలు పనులు చేపట్టేందుకు దాదాపు రూ.28లక్షలు కేటాయిస్తూ, కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నందిగామ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించి డిసెంబరు 26తో 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం శత వార్షికోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్ నాయకులతో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఈమేరకు శత వసంతోత్సవాల సందర్భంగా వాడవాడలా పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మండల కార్యదర్శి గడ్డం జంగయ్య, కొత్తూర్ మండల కార్యదర్శి ఎండీ ఖలీల్, లక్ష్మయ్య, అజ్మత్, మైసయ్య, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి చనిపోయి దినవారం కాలేదని చిన్నారిని బయటకు పంపిన అంగన్‌వాడీ టీచర్

నవాబుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి చనిపోయి దినవారం కాలేదని అంగన్‌వాడీకి హాజరైన చిన్నారిని టీచర్ బయటకు పంపించింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని గంగ్యాడ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఉపన్యాసకుడు ఉపేందర్ రెడ్డి కూతురు శాన్విక శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా వారి కులంలోని వ్యక్తి చనిపోయాడని, సుష్టి ఉంటుందని అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి విద్యార్థినిని బయటకు పంపించింది. ఈ విషయంపై తండ్రి ఉపేందర్‌రెడ్డి టీచర్‌ను ప్రశ్నించగా ఆయనకు కూడా అదే సమాధానం ఇచ్చింది. దీంతో బాధితుడు ఈ విషయాన్ని విలేకరులతో తెలిపాడు. ప్రస్తుత సమాజంలోనూ ఇలా చేయడం మూఢనమ్మకాలను బలపరచడమేనని వాపోయాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్‌లో శకటాల ప్రదర్శనకు స్థల సర్వే


కలెక్టరేట్ ముందు స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు గాను కలెక్టరేట్ ప్రాంగణంలో ఖాళీ స్థలాన్ని సర్వే చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం అధికారులు స్థలాన్ని సర్వే చేశారు. జిల్లాలు ఏర్పడక ముందు ప్రతీయేటా గణతంత్ర దినోత్సవాన్ని గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా కలెక్టరేట్‌ను కొంగర కలాన్‌లో నిర్మించారు. అప్పటి నుంచి అక్కడే గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చిన్న స్థలంలో ఇరుకుగా నిర్వహిస్తుండంతో శకటాల ప్రదర్శన లేకుండా పోయింది. ఈ సారి గణతంత్ర దినోత్సవంలో శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం కావాల్సిన స్థలాన్ని సర్వే చేస్తున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి


చెక్కులు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు సతీష్, శివ, ఇస్మాయిల్, యాదగిరి, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత

మహేశ్వరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, ఇందుకోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత రాజు తెలిపారు. శుక్రవారం దేవేందర్‌నగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బొంరాస్‌పేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ సూచించారు. మెట్లకుంటలో శుక్రవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. పేదలకు అన్యాయం జరగకుండా సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వేను సమగ్రంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్నగౌడ్, పంచాయతీ కార్యదర్శి సిద్దు తదితరులు ఉన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా కొన్ని ఇళ్ల వద్ద సిగ్నల్ రాక ఇబ్బందులు తప్పడం లేదని పంచాయతీ సిబ్బంది వాపోయారు.ఒక్కో రోజు 50 నుంచి 60 ఇళ్లు సర్వే చేయాల్సి ఉండగా 20ఇళ్లు కూడా పూర్తి కావడం లేదని పంచాయతీ సిబ్బంది తెలిపారు. సర్వేలో సడలింపు ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసిన ఘట్‌కేసర్ రైతులు


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కొంతం అంజిరెడ్డి, రైతులు

ఘట్‌కేసర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగావ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఘట్‌కేసర్ మండల రైతుబంధు కమిటీ మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధానంగా కూరగాయలను సాగు చేస్తున్న రైతులకు మార్కెట్ సదుపాయంతో పాటు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై విత్తనాలను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహరెడ్డి, శ్రీనివాస రాజు, పెంటారెడ్డి పాల్గొన్నారు.

ఫస్ట్ సౌత్ జోన్ టీ-20 క్రికెట్‌లో విద్యార్థి ప్రతిభ


కప్ అందుకుంటున్న మహ్మద్ అయాన్

తాండూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో జరిగిన ఫస్ట్ సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024లో తాండూరు మండలంలోని పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లోని కొంపల్లి ఫైన్‌బ్యాక్ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం ఫస్ట్ సౌత్‌జోన్ టీ-20 అండర్-14 విభాగంలో క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని అల్మాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ తరగతి చదు వుతున్న మహ్మద్ అయాన్ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ బౌలర్‌గా టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అల్మాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్లు మౌలానా మహ్మద్ అబ్దుల్లా అజ్హర్‌ఖాస్మీ, మౌలానా అబ్దుల్ రహ్మాన్ అథర్ ఖాస్మీలు మహ్మద్ అయాన్‌ను అభినందించారు.

నష్టపరిహారం అందించాకే పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న అప్పాయిపల్లి రైతులు

కొడంగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన మెడికల్, వెటర్నరీ కళాశాలల పనులను పూర్తి స్థాయిలో పరిహారం అందించిన తర్వాతే చేపట్టాలని అప్పాయిపల్లి సర్వే నెం.19లో గల రైతులు కోరారు. మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి 60 ఎకరాల భూమిని రైతుల నుంచి ప్రభుత్వం సేకరించింది. వారికి ఎకరాకు రూ.10 లక్షలు, 125 గజాల ఇళ్ల స్థలం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ఇప్పటికే ఎకరాకు రూ.10 లక్షలు అందించగా 125 గజాల ఇంటి స్థలం పట్టాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కళాశాలల నిర్మాణానికి సర్వే చేస్తుండగా అప్పాయిపల్లి రైతులు పలువురు పూర్తి స్థాయిలో పరిహారం అందించిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం రావాలని అధికారులు కోరినా కొందరు రైతులు పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాత పట్టాలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ప్రభుత్వ హామీ మేరకు పరిహారం, ఇంటి స్థలాలు అందించి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక


శ్రీనివాస ప్రభాకర్

శామీర్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ నూతన అధ్యక్షుడిగా శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం ఎంవీ. శ్రీనివాసప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంఘం నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం కార్యదర్శి గిరిధర్, ట్రెజరర్ తూకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి


స్పోర్ట్స్ పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులకు పరిమితం కాకుండా ఆటల పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఆర్‌జీఐ డైరెక్టర్ శాలిని అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమేన్స్(యూజీసీ)లో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఆర్‌జీఐ డైరెక్టర్ శాలిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మార్షల్ ఆర్ట్స్ క్వీన్ ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాతో అతలాకుతలం



రియల్‌ఎస్టేట్ కుప్పకూలింది ▸▸ అసెంబ్లీలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయాలతో మేడ్చల్ నియోజకవర్గంలో అంతా ఆగం ఆగం.. అతలాకుతలమవుతోందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్‌లో అంతా అయోమయం.. ఆగం ఆగంగా ఉందని, మేడ్చల్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 61 గ్రామపంచాయతీలుండగా నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని ఆరోపించారు. 28 గ్రామాలను మున్సిపాలిటీల్లో కలిపివేశారన్నారు. మున్సిపాలిటీలను కూడా జీహెచ్‌ఎంసీలో కలుపుతామంటున్నారని, మేడ్చల్‌లో తన హయాంలో 444మంది లీడర్లుగా ఎదిగారని, వారంతా నేడు మటాష్ అయ్యారంటూ తనదైన శైలిలో చెప్పుకొచ్చారు. పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలు వస్తాయని ఆశపడ్డారని వారిఆశలు ఆవిరయ్యాయన్నారు. జీహెచ్‌ఎంసీలో కలిపితే పన్నులు పెరిగే అవకాశం ఉందని, మున్సిపాలిటీలను మున్సిపాలిటీలుగానే ఉంచాలని మంత్రి శ్రీధర్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని మల్లారెడ్డి కోరారు. దేశంలోనే ఐటీరంగంలో, అభివృద్ధిలో నంబర్ వన్‌గా ఉన్న హైదరాబాద్ హైడ్రాతో హడలిపోయిందన్నారు. హైడ్రా వచ్చాక ఒక్కసారిగా రియల్‌ఎస్టేట్ భయాందోళనలతో కుప్పకూలిందన్నారు. హైదరాబాద్‌కు హైడ్రాతో దిష్టి తగిలిందన్నారు. తనకు పెద్దఎత్తున భూములు, విద్యాసంస్థలు ఉన్నాయని, తానేమి ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో లేనని అమెజాన్, గూగుల్ వంటి ప్రఖ్యాత సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చిన ఘనత కేటీఆర్‌దేనని చెప్పుకొచ్చారు. హైడ్రాతో పెద్దపెద్ద వాళ్ల గుండెలు గుభేల్ మన్నాయని, పేదల గుండెలు పగిలిపోయాయన్నారు. హడావుడిగా కూల్చివేతలు చేయవద్దని, నోటీసులు ఇచ్చి బాధితులకు న్యాయం చేసిన తర్వాత కూల్చివేతలు చేయాలన్నారు. వీటన్నిటిపై ప్రభుత్వం ఆలోచన చేసి ముందుకుపోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అసెంబ్లీలో కోరారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా

టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


సుంకిరెడ్డిని సన్మానిస్తున్న వెల్జాల గ్రామ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. విద్య వైద్య, ఉపాధి కల్పన, కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమని అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ నాయకులు శుక్రవారం టాస్క్ రాఘవేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. వెల్జాలలోని శ్రీ వేద్రాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా తోడ్పాటునందించాలని కోరారు. రాఘవేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు అంజయ్య గౌడ్, అజీజ్, అశోక్, రాజు, తదితరుల ఉన్నారు.

‘భూ భారతి’తో సమస్యలు పరిష్కారం

- ధరణి పోర్టల్‌తో బీఆర్‌ఎస్ దందాలు
- రియల్టర్లు పారదర్శకంగా ఉండాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ‘భూ భారతి’ని తీసుకువచ్చిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఆయన మాట్లాడుతూ మేధావుల అభిప్రాయంతో తీసుకువచ్చిన భూ భారతితో ధరణి పీడ విరుగుడయ్యిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో తప్పిదాల వల్ల సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారని అన్నారు. ఇక ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉంటుందన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులు భూ దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ గ్రామ స్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకు పేదల భూములను కొల్లగొట్టారని అన్నారు. 2014కు ముందు 2023 తరువాత బీఆర్‌ఎస్ నాయకుల ఆస్తులను చూస్తే ఈ విషయం తెలిసిపోతుందన్నారు. అలాగే పట్టా ఒక చోట, కాస్తు మరోచోట ఉండడంతో రైతులు సమస్యలకు గురవుతున్నారని, వాటన్నింటినీ పరిష్కరించడానికి రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని రియాల్టర్లు నీతి, నిజాయితీతో ఉంటూ చట్టబద్ధంగా వ్యాపారం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల జోలికొచ్చిన, చట్ట విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను నీతి, నిజాయితీతో ఉంటున్నానని, రియల్టర్లు, అధికారులు సైతం అలాగే వ్యవహరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై విచారణ చేసి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎ.కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ పరుగులు!

(5వ పేజీ తరువాయి)

న్యాయపరమైన చిక్కులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం దీనికి అదనంగా మరో 15వేలకుపైగా ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని తొలుత భావించింది. అయితే దీని చుట్టుపక్కల కొంత ప్రభుత్వ భూములు కూడా అందుబాటులో ఉండడంతో పరిమితంగానే భూసేకరణ చేయాలని నిర్ణయించింది. ఇటీవల లగచర్లలో భూసేకరణపై రాద్ధాంతం జరిగిన దరిమిలా ప్రభుత్వం భూసేకరణ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తోంది. భూములు ఇచ్చేందుకు రైతులు స్వయంగా ముందుకు వస్తే వారి అంగీకారంతో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఈ భూసేకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

తొలుత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం

ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ముందుగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు ఊపందుకుంటాయని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రీజినల్ రింగు రోడ్డు వరకు 41.5కి.మీ మేర నిర్మిస్తున్న 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులను ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ మొదలు పెట్టింది. తొలి విడత రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం దాదాపు 450 ఎకరాల భూసేకరణకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే మెట్రో రైలు నిర్మాణం కూడా చేపడుతోంది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. రెండో విడత స్కిల్ యూనివర్సిటీ నుంచి రీజినల్ రింగురోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ నోటిఫికేషన్ త్వరలో ఇవ్వనున్నారు. రెండో విడత భూసేకరణలో దాదాపు 500 ఎకరాల వరకు సేకరిస్తున్నారు.

అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు


నాపరాళ్ల గనుల్లో పనులను నిలిపివేస్తున్న ఆర్‌ఐ నాగార్జున్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాపరాళ్లను తవ్వి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగర్జున్ రెడ్డి అన్నారు. బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ ఆదేశానుసారం మండలంలోని జీవన్గి, కొర్విచెడ్, నవాల్గ ప్రాంతల్లోని గనులను శుక్రవారం ఆర్‌ఐ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేపట్టారు. అక్కడక్కడా నాపరాళ్ల తవ్వకాలు జరుపుతుండటంతో పనులను నిలిపివేశారు. అనంతరం గనుల యజమానులతో లీజులు తీసుకుని నాపరాళ్ల తవ్వకాలు జరుపాలని సూచించారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే ఎవరినైనా సరే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. నాపరాళ్లను లారీల్లో తరలిస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. రోజూ గనుల్లో పర్యటించి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ బిచ్చప్ప ఉన్నారు.

ఖనిజ సంపద రక్షణకు టాస్క్‌ఫోర్స్ టీం

అక్రమ నాపరాళ్ల తవ్వకాలు, ఖనిజ సంపద అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఇకపై అక్రమ మైనింగ్, ఇసుక, మట్టి తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ టీం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో మండల స్థాయి టీం పనిచేస్తుందని, రెవెన్యూ, పోలీస్, మైన్స్, ట్రాన్స్‌పోర్టు, ఫారెస్ట్ డిపార్టుమెంట్ అధికారులు ఉంటారన్నారు. ఈ టీం అక్రమ మైనింగ్, ఖనిజ సంపదను రవాణాను అడ్డుకునేందుకు నిత్యం పర్యవేక్షిస్తుందని ఆయన వివరించారు.

మున్సిపాలిటీ ఏర్పాటును విరమించుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న అనంతరెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మండలంలోని ఏడు గ్రామాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. ఈ ప్రాంతం మున్సిపాలిటీ ఏర్పాటు ద్వారా లాభం కన్నా నష్టమే ఎక్కువన్నారు. శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం 111 జీవోను తొలగించి 69 జీవోను అమలులోకి తీసుకువచ్చిందని.. దానిని అమలు చేయకుండా మున్సిపాలిటీలో గ్రామాలను కలిపితే తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోతారని, విపరీతమైన పన్నుల భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, సామాజిక సంఘాలు, కుల సంఘాలు ఏకమై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కొత్త నర్సింహరెడ్డి, కొత్త మాణిక్‌రెడ్డి, రవూఫ్, సురేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు చాకలి అరవింద్ రజక, పరమేశ్, షాబాద్ ప్రవీన్, రాజు, ఆసిఫ్, రవి, గునుగుర్తి చిన్న, అమీర్ తదితరులు ఉన్నారు.


బిహార్ సర్పంచ్‌లతో లక్ష్మీనర్సింహారెడ్డి

పల్లె ప్రగతి పనులు భేష్

బిహార్ సర్పంచ్‌ల బృందం కితాబు

కడ్తాల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికలు అభినందనీయమని, పల్లె ప్రగతి కార్యక్రమాలు బాగున్నాయని బిహార్ రాష్ట్ర సర్పంచ్‌ల బృందం కితాబు ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని బృందం కొనియాడినట్లు చెప్పారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌లో శుక్రవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి వచ్చిన బిహార్ సర్పంచ్‌ల బృందంతో లక్ష్మీనర్సింహారెడ్డి సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను బృందం సభ్యులకు వివరించినట్లు ఆయన తెలిపారు. సమష్టి నిర్ణయాల కారణంగానే గ్రామాలు అభివృద్ధి చెందినట్లు భావిస్తున్నామని వారు తెలిపినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ అరుణ్ రాజ్, సిక్కిం జీపీల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులు చరణ్ నాయక్, చంటి

ఫూడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ కబడ్డీ పోటీల్లో మండల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాలో శుక్రవారం జరిగిన సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పూడూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న చరణ్ నాయక్, రాకంచర్లకు చెందిన చంటి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. ఈ మేరకు ఈనెల 28వ తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఈ ఇద్దరు విద్యార్థులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

అరతులం బంగారం, రెండు వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం


మాట్లాడుతున్న ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్

మూడుచింతలపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను శామీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి అర్ధతులం బంగారం, రెండు వాహనాలతో పాటు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ రాములు నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో వ్యవసాయ పొలం వద్ద ధాన్యం ఎండపోసేందుకు వెళ్తున్న మహిళ మెడలోంచి ఇద్దరు గుర్తుతెలియని దుండగులు పుస్తెలతాడు తెంచుకొని పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో శామీర్‌పేట్ పోలీసులు సీఐ శ్రీనాథ్ నేతృత్వంలో ఆరు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం సుమారు 70కిలోమీటర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 600 సీసీ కెమరాలను పరిశీలించి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నూనె అంజిరెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తూ కీసర మండలం బండ్లగూడలో నివాసముంటున్నాడు. ఐటీ కంపెనీలో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో బోడుప్పల్‌కు చెందిన నరేందర్‌రెడ్డి అలియాస్ నవీన్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌తో పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. నరేందర్‌రెడ్డి కారు కొనుగోలు చేసి అంజిరెడ్డిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. ఇదిలాఉండగా అధిక సంపాదన లక్ష్యంగా ఈజీ మనీ కోసం చోరీల బాటపట్టారు. పథకం ప్రకారం చైన్ స్నాచింగ్ చేశారు. కారులో రెక్కీ నిర్వహించిన వీరు అదనుకోసం వేచి చూశారు. ఈనెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో హరిహర దేవాలయం సమీపంలో వడ్లు ఎండపోసేందుకు గ్రామానికి చెందిన మహిళా నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్ చేశారు. మహిళ ప్రతిఘటించడంతో దాదాపు అర్ధతులం బంగారు చైన్‌తో పారిపోయారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను పట్టుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి అరతులం బంగారం, రెండు వాహనాలు, సెల్‌ఫోన్లలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించిన సీఐ శ్రీనాథ్, సీసీఎస్ సీఐ నాయుడు, డీఐ గంగాధర్, ఎస్‌ఐలు హారిక, పరశురాం, దశరథ్, సిబ్బందిని ఏసీపీ రాములు అభినందించారు.

ఏపీ జీవీబీ శాఖలు టీజీబీలో విలీనం

- ఈనెల 28 నుంచి 31వరకు గ్రామీణ బ్యాంకు లావాదేవీలు నిలిపివేత
- తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్రాంరెడ్డి


మాట్లాడుతున్న గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి

తాండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం వారి ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(జీవీబీ) పరిధిలో ఉన్న తెలంగాణలోని ఐదు బ్రాంచ్‌లను జనవరి 1వ తేది నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం అవుతున్నాయని హైదరాబాద్ రీజియన్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. తాండూరు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావుతో శుక్రవారం కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పరిధిలో ఉన్న మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, వరంగల్ బ్రాంచ్‌లను ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలోని వస్తాయని తెలిపారు. అయితే అంధ్రప్రదేశ్‌లో ఉన్న వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం బ్రాంచ్‌లు మాత్రం ఆంధ్రప్రదేశ్, గ్రామీణవికాస్ బ్యాంకులుగానే కొనసాగుతాయని తెలిపారు. శాఖలు, వ్యవస్థల సులభ విలీనానికి శాఖ కార్యకలాపాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, యూపీఐ, ఏటీఎం, మొబైల్, బ్యాంకింగ్, రిటైర్మెంట్ బ్యాకింగ్, ఖాతాదారుల సేవా కేంద్రాలు ఈనెల 28వ తేదీ నుంచి 31 వరకు ఎలాంటి లావాదేవీలు ఉండవని తెలిపారు. తిరిగి బ్యాంకింగ్ సేవలు జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 54బ్రాంచ్‌లు ఉన్నాయని, రూ.1240కోట్ల డిపాజిట్లు ఉండగా రూ.1760కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



ఆమనగల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహద పడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యతోపాటు కరాటే నేర్చుకోవాలని సూచించారు. సీఎం కప్ క్రీడల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. తైక్వాండో కార్యదర్శి బాబు లాల్ తో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి కరాటే పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర స్థాయి టీంకు కరాటే విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కసిరెడ్డి బెల్టులు, బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు పర్వత్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, మోతి లాల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మేడ్చల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అధికారులను సూచించారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆధాయం , ఖర్చుల పట్ల చర్చించారు. పలు అభివృద్ధి పనుల కోసం నిధుల కేటాయింపు పట్ల సభ్యులు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. కాగా పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక కౌన్సిలర్ మణికంఠ గౌడ్ రూ.కోటి రూపాయలు ప్రతిపాదన పెట్టగా ప్రస్తుతం రూ.50లక్షలు కౌన్సిల్ సమావేశంలో మంజూరు చేశారు. అవసరమైతే అదనంగా నిధులు మంజూరు చేస్తామని చైర్‌పర్సన్ దీపిక, కమిషనర్ నాగిరెడ్డిలు సమావేశంలో వెల్లడించారు. అదేవిధంగా ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన పూడూరు రాయిలాపూర్ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. మున్సిపల్ పరిధిలో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి , కౌన్సిలర్లు , అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌గా తాండూరు రోడ్డు

- 134 కిమీటర్లుగా 'నేషనల్ హైవే 50'
- తాండూరు మీదుగా బీదర్ వరకు నిర్మాణానికి కార్యాచరణ
- తగ్గనున్న దూరం, సమయం

తాండూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాండూరు మీదుగా వెళ్లే మరో రోడ్డుకు జాతీయ రహదారి హోదా దక్కనుంది. రోడ్ల అభివృద్ధి ఉన్నతీకరణ ప్రక్రియలో భాగంగా తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాలకు అనుసంధానంగా ఈ జాతీయ రహదారిని అభివృద్ధి పర్చేందుకు రాష్ట్రం ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది.

నేషనల్ హైవే-50

రాష్ట్ర రోడ్లను జాతీయ రోడ్లుగా మార్చుచేసి అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 16 రహదారులను ఉన్నతీకరించే ప్రక్రియలో భాగంగా తాండూరు మీదుగా 134కిలోమీటర్ల దూరం వరకు రోడ్డును అభివృద్ధి పరిచేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మన్నెగూడ వయా తాండూరు మీదుగా బీదర్ వరకు జాతీయ రహదారిగా హోదాను కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు వేగవంతం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు వ్యాపార వాణిజ్య కేంద్రం, కర్ణాటక



కుంచారం-జహీరాబాద్ రోడ్డు

రాష్ట్రానికి అనుసంధానంగా ఉన్న తాండూరు మీదుగా 60 కిలోమీటర్ల మేర రెండు వరుసల రహదారిని ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు. దాంతో సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉన్నందున కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వాహన దారులు ఈ రోడ్డు గుండానే హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. సింగిల్ రోడ్డుగా తాండూరు-జహీరాబాద్, తాండూరు-వికారాబాద్ ఉన్నందున వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా రవాణా వ్యవస్థ కూడా మెరుగుపడితే వ్యాపారంగా వాణిజ్యంగా కూడా ఎంతో ఉపయోగపడే అవకాశాలున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య జాతీయ హోదా కల్పిస్తే ఈ రోడ్డులో రవాణా వ్యవస్థ మరింత మెరుగు పడుతుంది.

పెరగనున్న వ్యయం

ఈ రహదారికి గతంలో 2023లో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అప్పట్లో దాదాపు రూ.300 కోట్లు అంచనా అవుతుందని ప్రతిపాదన సిద్ధం చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రతిపాదనలు పెండింగ్‌లో పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి నివేదించలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి ఈ రహదారిని మెరుగుపర్చాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఈ రోడ్డు నిర్మాణానికి కదలిక వచ్చింది. 2017లో కూడా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ రోడ్డును విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ ప్రాంత ప్రజలు గుర్తుచేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే తెలంగాణలోని పలు పట్టణాలకు, కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ పట్టణాలకు రాకపోకలు సజావుగా సాగుతాయి.

క్రైం కార్నర్

విద్యార్థి అదృశ్యం



విష్ణు

మోమిన్‌పేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాంనాథ్‌గూడుపల్లి గ్రామానికి చెందిన కొత్తగడి బాల్‌రాజ్, మంజుల దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వారి కుమారుడు విష్ణును గురునానక్ యూనివర్సిటీలో చదివిస్తున్నారు. విద్యార్థి విష్ణుకు తల్లిదండ్రులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మూడు రోజులుగా రావడం లేదని కళాశాల యజమాన్యం తెలపడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై శుక్రవారం తల్లిదండ్రులు విద్యార్థి విష్ణు కనిపించడం లేదంటూ ఇబ్రహింపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

మోమిన్‌పేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్థులు, బాధితుడు మంగలి శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మంగలి శ్రీనివాస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, ఏరాజ్‌పాష, బాబా, షానవాజ్ హుసేన్, రవీందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ ఘటనలో 3 తులాల బంగారం, రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తరఫున తనకు ఆర్థిక సాయం అందించాలని కోరాడు. ఘటనాస్థలాన్ని మోమిన్‌పేట్ ఆర్ఐ సరిత, పంచాయతీ కార్యదర్శి స్వప్న, సిబ్బంది మహేశ్‌గౌడ్, రాఘవేందర్ పరిశీలించారు.

ఆలయంలో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అవుషాపూర్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజువారిగానే పూజారి శుక్రవారం తెల్లవారుజామున బ్రహ్మంగారి ఆలయానికి పూజచేయడానికి వెళ్లాడు. ఆలయ గర్భగుడికి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా, అమ్మవారి మెడలోని అర తులం బంగారు ఆభరణం, హుండీ కనిపించలేదు. సమీపంలోని నిర్మానుష ప్రదేశంలో హుండీ కనిపించింది. ఈ మేరకు పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమ్మవారి ఆభరణాలతో పాటు హుండీలో యాభైవేల నగదు దుండగులు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

భార్యను వేధిస్తున్న భర్త రిమాండ్

తాండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు వరకట్నం తేవాలని వేధిస్తున్న భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తాండూరు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీన తాండూరు పట్టణం సాయిపూర్ తాతాగుడి ప్రాంతానికి చెందిన సారియా సుల్తానా తన భర్త ఖలీల్ ఖురేషి అత్త సుల్తానాబేగం, ఆడపడుచు సల్మా కలిసి మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారని ఎస్ఐ చెప్పారు. తనతో పాటు తొమ్మిది నెలలు ఉన్న కొడుకు సోహన్‌ను విచక్షణా రహితంగా కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ అనంతరం శుక్రవారం తాండూరు కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

తాండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నిర్వహిస్తుండగా ఆరుగురికి జరిమానా, ఒక వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తాండూరు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి ఎదుట శుక్రవారం డ్రంక్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురిని హాజరుపరచగా వారికి వేయి రూపాయల చొప్పున జరిమాన విధించగా మరో వ్యక్తి చెంగోల్ గ్రామానికి చెందిన మనోహర్‌కు వేయి రూపాయల జరిమానా, ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు చెప్పారు.

వృద్ధుడిపై పిచ్చి కుక్క దాడి

ధారూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో వృద్ధుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొండాపూర్‌కలాన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండాపూర్ కలాన్‌కు చెందిన కేశపల్లి నర్సింహులు(70) బహిర్భుమికి వెళ్లి వస్తుండగా పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. ఈఘటనలో గాయపడిన నర్సింహులును కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికను అపహరించిన యువకుడి రిమాండ్

కులకచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలికను అపహరించిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు కులకచర్ల పోలీసులు తెలిపారు. నవంబరు మొదటి వారంలో కుల్కచర్ల మండలానికి చెందిన ఓ బాలికను దోమ మండలంలోని గోడుగోనిపల్లికి చెందిన నరేశ్ అపహరించుకెళ్లాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



కులకచర్ల: చౌడాపూర్‌లో మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్

కులకచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. చౌడాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అమిత్‌షా క్షమాపణ చెప్పలేని పక్షంలో రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు ప్రభు, గంగ్యానాయక్, లక్ష్మణ్, జంగయ్య, భరత్, ఇబ్రహిం, జహంగీర్ పాల్గొన్నారు.

తాండూరు: అంబేడ్కర్, భారత రాజ్యాంగంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను తక్షణమే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ పేరును నిరంతరం స్మరించడం ఫ్యాషన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. చట్టబద్ధమైన రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు. ఈ సమావేశంలో దళిత ప్రజాసంఘాల నాయకులు రాములు, బలరామ్, నర్సింహులు, రవికుమార్, కిష్టప్ప పాల్గొన్నారు. అదేవిధంగా మాల మహానాడు ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మండలాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

పరిగి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్, జాతీయ అంబేడ్కర్ అవార్డు గ్రహీత కోళ్ల యాదయ్యలు మాట్లాడుతూ.. అమిత్‌షా తమ వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల సైదుపల్లి రాములు, సత్తయ్య, రఘురామ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నవాబుపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మీనపల్లి శివప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే అంబేడ్కర్ వాదులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.



మేడ్చల్ టౌన్: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ సంఘం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. వెంటనే అంబేడ్కర్ వాదులకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు రమేశ్‌బాబు, శ్యామ్ సుందర్, నరోత్తంరెడ్డి, అంజి, భీములు, సాయిలు, బాలప్ప, రాములు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తన వాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరస చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు దేవరాజ్, మహేష్, శంకర్, సంతోష్ గౌడ్, వర్దారెడ్డి, రవీందర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించి కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించి పార్టీ నుంచి బహిష్కరించాలని సీపీఎం, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు చింతల యాదయ్య, సబిత డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం అమిత్‌ షా వ్యాఖ్యలకు నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం, సీఐటీయూ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరీ, చంద్రమోహన్, యాదగిరి, శోభ, శ్రీలత, పాపయ్య, రఘు, సాయి పాల్గొన్నారు.

శామీర్‌పేట: అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా కించపరిచేలా మాట్లాడటం దారుణమని మాలమహానాడు మండల అధ్యక్షుడు బొమ్మర్ల నాగరాజు ధ్వజమెత్తారు. మండల కార్యాలయాల ఎదుట ఉమ్మడి శామీర్‌పేట మండల మాలమహానాడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్దఎత్తున ఆందోళన చేశారు. అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు, దళితసేన నాయకులు, నీరుడి బాలేష్, కైర బాలు, కైర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.28లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

కీసర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.28లక్షలతో అభివృద్ధి పనులకు ఆమెదం తెలిపినట్లు చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. కీసరలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలకు భగీరథ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.5లక్షలు, లైట్ల మరమ్మతుకు రూ.5లక్షలతో పాటు పలు పనులు చేపట్టేందుకు దాదాపు రూ.28లక్షలు కేటాయిస్తూ, కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పెద్దేముల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ కోరారు. మారెపల్లి గ్రామ సమీపంలోని సుమిత్ర కాటన్‌మిల్లును పలువురు నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను అందించాలని కోరారు. కొనుగోలు కేంద్రానికి పత్తితీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. మీకు ఇక్కడ ఇబ్బందులు కలిగిస్తే మాదృష్టికి తీసురావాలని చెప్పారు. రైతులు పత్తి విక్రయించగా వారికి నిర్వాహకులు అందజేసిన బిల్లులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హరీష్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో క్రిస్మస్ సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న ఏవో రాంమోహన్

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కలెక్టరేట్ ఏవో రాంమోహన్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని శాంటాక్లాస్ వేషధారణలో ఉన్న చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. బైబిల్‌లోని క్రీస్తు పుట్టుక గురించి ప్రవచనాలు వినిపించారు.

ఘనంగా కాళీకాదేవికి పూజలు

కులకచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని మారుమూల గిరిజన తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం కాళీకాదేవికి గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడాపూర్ మండలంలోని వాల్యానాయక్ తండాలో గిరిజనుల పూజలు కొనసాగుతున్నాయి.

వైభవంగా గంజ్ రేణుకా నాగ ఎల్లమ్మ జాతర

తాండూరు: పట్టణంలో వ్యాపార, వాణిజ్య కూడలిగా ఉన్న నెహ్రూగంజ్‌లో కొలువైన రేణుకా నాగఎల్లమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు ప్రత్యేకపూజలు, మహిళల బోనాల ఊరేగింపు నిర్వహించారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ జడ్పీటీసీ ప్రమోదినిరెడ్డి, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు శకుంతల, వ్యాపారులు పాల్గొన్నారు.

సిద్దనొంపు ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు అంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి హోమం, కలశ పూజ, చందన లేపనంతో పురోహితులు పూజలు చేశారు. హిందూ వాహిని ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాల ఎదులాబాద్‌లో 2025-2026 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రాములు తెలిపారు. నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 2025 వరకు ఆన్‌లైన్‌లో రూ. 100 రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

(5వ పేజీ తరువాయి)

ఏడుగురికి బెయిల్ రాలేదు. కాగా, జైలు నుంచి విడుదలైన రైతులకు బీఆర్ఎస్ నాయకులు, గిరిజన సంఘాల నేతలు పూల దండలతో ఘన స్వాగతం పలికారు.

లగచర్లలో ఆనందోత్సాహాలు

కుటుంబ సభ్యుల ఘనస్వాగతం

నవంబరు 11న కొడంగల్ మండలం లగచర్లలో కలెక్టర్, అధికారులపై లగచర్ల గ్రామంతో పాటు రోటిబండ తండా, పులిచెర్ల కుంట తండా, హకీంపేట తదితర గ్రామాల ప్రజలు దాడి చేసిన ఆరోపణలతో 32 మంది అరెస్టయిన విషయం తెలిసిందే. వీరిలో కొంతమందిని చర్లపల్లి జైలుకు తరలించగా, మరికొందరిని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు. దాదాపు 37 రోజులపాటు జైల్లోనే ఉన్న లగచర్ల గ్రామస్తులు శుక్రవారం విడుదల అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్, గిరిజన సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం జైలుబయట ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులను కలిసి కన్నీరుమున్నీరయ్యారు.

నా వీసా రద్దు అయింది



అన్యాయంగా నన్ను అరెస్టు చేసి తీసుకొచ్చారు. నేను సౌదీలో పని చేసుకుంటాను. భోజనం చేసి టీవీ చూసి పడుకున్న. సాయంత్రం ఒక్కసారిగా అకస్మాత్తుగా 30 మంది పోలీసులు వచ్చి మాపై దాడి చేశారు. పరిగి సబ్ జైల్లో పెట్టి కొట్టారు. కేసు ఉన్న కారణంగా నాకు వీసా ఈసారి రద్దయింది. ఆరోజు దాడి జరిగిన సమయంలో నేను అక్కడ లేను. గుండెలు పగిలేలా ఏడ్చినా పోలీసులు కనికరించకుండా విచక్షణారహితంగా కొట్టి జైల్లో పెట్టారు.

\- పాత్లవత్ శ్రీను నాయక్

కూతుర్ని చూడగానే ప్రాణం వచ్చింది



నేను విడుదల అవుతున్నాని నా కూతురు జైలు వద్దకు వచ్చింది. వేయి కళ్లతో నా రాక కోసం నిరీక్షించింది. తనను చూడగాను నాకు మళ్లీ ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ఈ దరిద్రం గొడవల వల్ల ఇన్ని రోజులు కుటుంబానికి దూరంగా బతకాల్సి వచ్చింది. పోలీసులు మమల్ని ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా మేము భూముల్ని మాత్రం ఇయ్యము. చచ్చే వరకు పోరాడైనా భూముల్ని దక్కించుకుంటాం.

-జర్పు హీర్యా నాయక్, రోటి బండ తండా

బలవంతంగా అరెస్టు చేశారు

నా భార్య గర్భవతి అని చెప్పినా వినలేదు. బలవంతంగా లాక్కొచ్చి అరెస్ట్ చేశారు. ఆ వీడియోలో పక్కన కనపడడమే నేను చేసిన పాపం. అందరికంటే ఎక్కువగా నన్నే కొట్టారు. నన్ను ఎనిమిది మంది పోలీసులు కొట్టారు. ఎవరితో మాట్లాడనివ్వలేదు. ఘోరమైన బూతులు తిడుతూ అవమానించారు. ఇది రాజకీయ పార్టీల బలవంతపు అరెస్టునే తప్ప మేము అధికారులపై ఎలాంటి దాడికి పాల్పడలేదు.

-పాత్లవత్ ప్రవీణ్ కుమార్, పులిచెర్ల కుంట తండా

సంక్షిప్తంగా..

కుట్టుమిషన్ దరఖాస్తుదారులు హార్డ్ కాపీలు అందించాలి

వికారాబాద్: ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హార్డ్ కాపీలను జిల్లాలోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హన్మంత్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

కులకచర్ల: ఈ నెల 19న పరిగిలో జరిగిన ఓపెన్ టు ఆల్ జిల్లా స్థాయి సీఎం కప్ ఖోఖో పోటీల్లో ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి వెంకటేశ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, పీడీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

కొడంగల్: పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు శుక్రవారం రాత్రి తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, ఎస్ఐ జీవీ.సత్యనారాయణ ప్రభుత్వం నుంచి వచ్చిన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చక్రం పురస్కారాలు అందజేత

మేడ్చల్ టౌన్: మేడ్చల్ ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ సందర్శించి డిపో ఆవరణలో మొక్కలు నాటారు. నవంబరు నెలలో అత్యధికంగా ఇందనం ఆదా చేసిన డ్రైవర్లకు, ఇన్సెంటీవ్ పొందిన కండక్టర్లకు ప్రగతి చక్రం పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఇంజినీర్ స్నేహ లత పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనకు ఆర్థిక సాయం

పరిగి: మండల పరిధిలోని అలియాబాద్‌తండా సేవలాల్‌మహరాజ్, మరియమ్మ మాత బంజారా నాట్యప్రదర్శనను బీఎంపీ జిల్లా అధ్యక్షుడు, మాస్ సంస్థ చైర్మన్ పి.గట్యానాయక్ తిలకించి రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బీఎంపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాయక్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

పరిగి రూరల్: సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయితీని పరిగి మునిసిపాలిటీలో విలీనం చేయొద్దని ఆ గ్రామానికి చెందిన మెజార్టీలు కోరారు. ప్రత్యేక అధికారి కరీం అధ్యక్షతన శుక్రవారం సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన గ్రామసభలో మెజార్టీ సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అదనపు గదులను పూర్తి చేయాలి

పెద్దేముల్, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): మారెపల్లి సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు రూ.2కోట్ల 30లక్షల వ్యయంతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పూర్తిచేయాలని ఈడబ్ల్యుఐడీసీ ఈఈ వైవి.రామ్‌కుమార్ కాంట్రాక్టర్‌కు సూచించారు. భవనానికి ఫైనల్ స్లాబ్ వేస్తుండగా శుక్రవారం డీఈఈ ఎస్.రాజుతో కలిసి ఈఈ రామ్‌కుమార్ పరిశీలించారు.

సంత్‌గాడ్గే బాబాకు ఘన నివాళి

బషీరాబాద్: ఎక్మాయి శ్రీ బాలప్ప స్వామిజీ ఆశ్రమంలో డాక్టర్ శ్రీనివాస్ స్వామిజీ నేతృత్వంలో సంత్ గాడ్గే బాబా 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గోపిరజక, నర్సింహులు, విఠల్ పాల్గొన్నారు.

కండ్లపల్లిలో బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

పూడూరు: కండ్లపల్లిలో శుక్రవారం బూత్‌కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలోని బూత్ నెంబర్-297, 298 అధ్యక్షుడిగా ఎస్.ఆంజనేయులు, టి.నర్సింహులును నియమించారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

తాండూరు: ఖాంజాపూర్ గేటు సమీపంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న బీరప్ప ఆలయ నిర్మాణానికి తాండూరు పట్టణ బిఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు రూ.25వేలను శుక్రవారం అందజేశారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

కొడంగల్: కొడంగల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలో వక్ఫ్‌భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని మాజీ ఉపసర్పంచ్, మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. వక్ఫ్ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

దోమ: ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, జీపీఎఫ్, సీపీఎస్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం అందించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు అన్నారు. పరిగిలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్ తెలిపారు.

కోట్‌పల్లి ఎస్ఐగా గఫర్

బంట్వారం(కోట్‌పల్లి): మండల నూతన ఎస్ఐగా గఫర్ శుక్రవారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్పీ కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా కోట్‌పల్లి ఎస్ఐగా వచ్చారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పరిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్‌హుస్సేన్, నాయకులు కుడుముల వెంకటేశ్‌లు అన్నారు. 9వవార్డులో వార్డు అధికారి నర్సింహులుతో కలిసి ఇందిరమ్మ దరఖాస్తుల వేరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. నాయకులు అబ్దుల్‌ఘనీ, కె.యాదయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

యాలాల: మండలంలోని రాస్నంలో ఇందిరమ్మ ఇళ్లసర్వే నిర్వహించారు. మండల ఎంపీఈవో యాదయ్య రాస్నం గ్రామానికి వెళ్లి శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వేచేసి వివరాలు సేకరించారు.

మోమిన్‌పేట్: ఎన్కతలలో పంచాయతీ కార్యదర్శి నర్సింహులు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు దోరేటి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శి గోపాల్‌తో పాటు వార్డుల్లో తిరిగి కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

మేడ్చల్ టౌన్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో చేపడుతున్న ఇందిరమ్మ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



వికారాబాద్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నివాసం నుంచి బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డగించడంతో అక్కడే కూర్చోని ధర్నా చేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ పట్టణ మునిసిపల్ కౌన్సిలర్ గోపాల్ మాట్లాడుతూ.. ఈ కార్‌రేస్ అగ్రిమెంట్‌లో ఎలాంటి అవినీతిలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపేడే ప్రసక్తి లేదని మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టకుండా శుక్రవారం ముందస్తుగా మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెరేస్టు చేశారు. అరెస్టయిన వారిలో విష్ణు చారి, నవీన్ రెడ్డి ఉన్నారు.